

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
బుధవారం 9 జులై 2025 పేజీలు 8



బాబూ గిరి...

# ఆ అంతస్తులేంటి స్వామి !



- డబ్బులిస్తే చాలా అనుమతులు అవసరం లేదా ?
- గాంధీనగర్, సత్యనారాయణపురంలో మితిమీరుతున్న అవినీతి అక్రమ కట్టడాలు
- సిటీ ప్లానర్‌కు సైతం వాటాలివ్వాలంటూ ప్రచారం
- లక్షల్లో వసూళ్ళు... డబ్బులివ్వకుంటే కూల్చివేతలు
- టౌన్ ప్లానింగ్‌లో పేదోడికి ఒక న్యాయం పెద్దోడికి మరొక న్యాయం
- మున్సిపల్ కమిషనర్ సారూ జర దేఖో

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** టౌన్ ప్లానింగ్‌లో వింత పోకడ అమలవుతోంది. డబ్బులిస్తే ఎన్ని అంతస్తులైనా వేసుకోవచ్చుట. అదే డబ్బులివ్వకుంటే మాత్రం కూల్చివేతలట... విభజించు పాలించు పెద్దోడికి ఒక న్యాయం పేదోడికి మరొక న్యాయం అనేలా రాజకీయ నాయకుల కాడ ఈ మాటలింటూ వింటాం తాజాగా టౌన్ ప్లానింగ్ డిపార్ట్ మెంట్ లో ఈ చేష్టలు చూస్తున్నాం. **ఇక పూర్తి వివరాల్లోకి వెళితే...**

గాంధీనగర్, సత్యనారాయణపురంలో అంతస్తుల మీద అంతస్తులు వెలుస్తున్నాయి. ఇటీవల గాంధీనగర్ చుట్టు పక్కల ప్రాంతాల్లో అక్రమ కట్టడం వేస్తే చాలు అధికారులు ఆఘమేఘాల మీద వెళ్ళి మరీ పగులకొట్టి ప్లాన్ తీసుకొనేదాకా అనుమతిచ్చేవారు కాదు. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధికారులు మారిపో యారు. ఏం జరుగుతుందో

మిగతా 2లో

# పేదల సంక్షేమాభివృద్ధికి పి-4

## పేదరికాన్ని రూపుమాపడంలో కలిసికట్టుగా పని చేయాలి....మంత్రి కొల్లు రవీంద్ర





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంలో భాగంగా పీపుల్, పబ్లిక్, ప్రైవేట్, పార్ట్నర్‌షిప్ (పి 4) విధానం ద్వారా పేదల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఆయన నగరంలోని జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి మచిలీపట్నం నియోజకవర్గానికి సంబంధించి పి-4 కార్యక్రమం అమలుపై పట్టణ, గ్రామ సచివాలయ సిబ్బంది,

మిగతా 2లో...



# అన్నదాతలకు..
## ఉద్యాన సిరుల పంట



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** ఉపాధి హామీ పథకం ఆసరాతో ఉచితంగా పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టవచ్చుని.. ఉద్యాన పంటల సాగుతో రెండు మూడు రెట్లు అధిక ఆదాయం పొందొచ్చుని, ప్రభుత్వ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నదాతలకు సూచించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం-జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం గంపలగూడెం మండలం, గోసవీడు గ్రామంలో ఉద్యాన పంటల పెంపకం మెగా గ్రౌండింగ్ మేళా జరిగింది. ఇమ్మడి నాగమణికి చెందిన 1.15 ఎకరాల భూమిలో మామిడి మొక్కలు నాటే

మిగతా 2లో

(మొదటిపేజీ తరువాయి)



## పేదల సంక్షేమాభివృద్ధికి పి-4

అధికారులు, పార్టీ నాయకులు తదితరులతో సమావేశమై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి-4 కార్యక్రమ ఉద్దేశాన్ని వారు వివరించి, సలహాలు, సూచనలు కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పి 4 ప్రపంచంలోనే ఒక గొప్ప కార్యక్రమం అని పేర్కొంటూ, మెరుగైన సమాజ నిర్మాణం కోసం రూపకల్పన చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడిన వ్యక్తుల సహకారంతో దిగువ కుటుంబాలను పైకి తీసుకురావాలన్నదే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం అని, తద్వారా 2029 నాటికి సమాజంలోని పేదరికాన్ని జీరో స్థాయికి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ ప్రణాళిక ద్వారా పేదరిక నిర్మూలన, సమాజ అభివృద్ధికి మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం అందించేందుకు సాధ్యమవుతుందన్నారు. పి 4 పథకం సమాజంలోని అగ్రశ్రేణి 10 శాతం ధనవంతులను ప్రోత్సహించి, దిగువన ఉన్న 20 శాతం పేద ప్రజలను దత్తత తీసుకొని వారికి మద్దతు ఇచ్చేలా చేస్తుందని, ధనవంతులు మార్గదర్శిగా వ్యవహరిస్తూ దిగువన ఉన్న బంగారు కుటుంబాలకు చేయూతనందించేలా చేస్తుందన్నారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్లో 19,17,151 బంగారు కుటుంబాలు గుర్తించగా, అందులో 1,64,546 బంగారు కుటుంబాలను 10,343 మంది మార్గదర్శిలు దత్తత తీసుకోవడం జరిగిందని తెలిపారు. కృష్ణాజిల్లాలో 68,948 బంగారు కుటుంబాలను గుర్తించగా, అందులో 2,723 బంగారు కుటుంబాలను 3,44 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారని, మచిలీపట్నం నియోజకవర్గంలో 9,778 బంగారు కుటుంబాలు గుర్తించామని, అందులో 398 బంగారు కుటుంబాలను 106 మంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో 76 గ్రామ వార్డు సచివాలయాలు ఉన్నాయని, డివిజన్ ఇన్చార్జిల సహకారంతో సిబ్బంది వారి పరిధిలో



ఉన్న మార్గదర్శిలను గుర్తించాలని, ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని వారికి వివరించి ప్రోత్సహించాలని సూచించారు. మచిలీపట్నం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మంత్రి కోరారు.

**పేదరికాన్ని రూపుమాపే పి 4...**

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని పేదరికాన్ని రూపుమాపేందుకు ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ పూర్తిస్థాయిలో నిర్మూలన కాలేదని, అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సమాజంలోని పేదరికాన్ని జీరో స్థాయికి తీసుకురావాలనే లక్ష్యంతో పి 4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు.జీవితంలో ఉన్నతంగా స్థిరపడిన ధనికులను గుర్తించి, పేదలను దత్తత తీసుకొని వారి అభ్యున్నతికి కృషి చేయడం ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యం అన్నారు. బంగారు కుటుంబాలుగా గుర్తించిన వారిలో అవసరం ఉన్నవారికి ఆర్థిక సహాయం లేదా వస్తు సేవల రూపంలో చేయూత అందించడం, పిల్లల చదువుకు ఖర్చును భరించడం, ఇళ్ళ నిర్మాణాలకు సహకారం అందించడం, యువతకు ఉపాధి కల్పించడం తదితర సేవలను మార్గదర్శిల ద్వారా అందించి పేదల స్థితిగతులను మార్చాలన్నదే ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రతి సచివాలయ పరిధిలోని దేశ విదేశాలలో స్థిరపడిన ధనికులను గుర్తించి బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే విధంగా వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, మచిలీపట్నం నియోజకవర్గ ప్రత్యేక అధికారి మార్కెటింగ్ ఏడి ఎల్ నిత్యానంద, మండల ప్రత్యేక అధికారి పౌరసరఫరాల సంస్థ డిఎం శివరాం ప్రసాద్, నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, సహాయ మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, తహసిల్దార్ మధుసూదన్ రావు, మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ, పలువురు కార్పొరేటర్లు, డివిజన్ ఇన్చార్జిలు, పార్టీ నాయకులు, పట్టణ గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాబూ గిరి... ఆ అంతస్తులేంటి స్వామి !

(మొదటిపేజీ తరువాయి)

తెలియదు కాని అక్రమ కట్టడాలు ఎన్ని వేస్తున్న నోరు మెదపడం లేదు కదా ఆ బిల్డింగ్ వైపు వెళ్ళాలంటేనే జంకుతున్నారు. ఇది గాంధీనగర్, సత్యనారాయణపురం ప్రాంతాలే కావు ఆ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో కూడా ఇదే తంతు. తాజాగా గాంధీనగర్, సత్యనారాయణపురం ప్రాంతాల్లో స్టిల్ట్ జి ప్లస్ టు తీసుకొని జి ప్లస్ త్రీ కడుతున్నారు. సత్య నారాయణపురం లోనూ ప్లాన్ లు లేకుండా చిన్న పాటి గజాల్లో అక్రమ నిర్మాణాలు కడుతు న్నారు. దాంతో పాటు సన్నిధానం వారి వీధిలో స్టిల్ట్ జి ప్లస్ త్రీ కి అనుమతి తీసుకొని జి ప్లస్ ఫోర్ కడుతున్నారు. ఇదేమని కూల్చివేసిన చుట్టుప్రక్కల వాళ్ళు వెళ్ళి అడిగితే నీ దిక్కున్న చోట చెప్పుకో అంటూ బిల్డింగ్ ఇన్ స్పెక్టర్లు చెప్పడం పై విమర్శలు వస్తున్నాయి. అయితే డబ్బులిస్తే మీకు అనుమతిలిస్తాం అని నేరుగా భవన యజమానులతోనే డీల్ కుదుర్చుకోవడం పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే భవన యజమానులతో కుదుర్చుకున్న డీల్ ప్రకారం ఆ సొమ్ము అతని కి ఒకరే కాదట అతనితో పాటు ఎసిపి, డిసిపి, సిటీ ప్లానర్ కు సైతం వాటాలివ్వాలి లక్షల్లో ముడుపులు చెల్లించుకోండి అంటూ చెప్పుతుండడంతో అసలే అప్పులు చేసి బిల్డింగ్ లు కట్టుకుంటున్న వారు తాజాగా లంచాలతో పెరుగుతున్న బడ్డనతో అల్లాడిపోతున్నారు. మున్సిపల్ కమిషనర్ ఒకసారి గాంధీనగర్, సత్యనారాయణపురం ప్రాంతాల్లో వెలుస్తున్న అక్రమ కట్టడాలపై విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయంటున్నారు స్థానికులు. చూడాలి మున్సిపల్ కమిషనర్ అక్రమ నిర్మాణాలపై వస్తున్న అవినీతి ఆరోపణలపై ఎంతమేరకు దృష్టి పెడతారోనని....



సన్నిదానం వారి వీధి, సత్యనారాయణపురం.



హిందీ వీధి, కరీమ్ హొటల్ దగ్గర, గాంధీనగర్

# ప్రతి గ్రామాన జనసేన పార్టీ దిమ్మె నిర్మాణమే మా లక్ష్యం

నందిగామ, జూలై 8, మేజర్ న్యూస్:అనాసాగరం గ్రామంలో జనసేన పార్టీ జెండా స్తూపనిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథిగా వచ్చిన నందిగామ నియోజకవర్గ సమన్వయకర్త తంబళ్ళపల్లి రమాదేవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ప్రతి గ్రామాన జనసేన జెండా దిమ్మ మా లక్ష్యమని ఈరోజు అనాసాగరం గ్రామంలో జనసేన దిమ్మె భూమి పూజ కార్యక్రమం చేసినందుకు ఎంతో సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. ముఖ్యంగా అనాసాగరం గ్రామంలో జనసేన దిమ్మె ఎప్పటినుంచో నిర్మించాలని ఒక కల అని ఆ కల కు శంకుస్థాపన జరిగిందని ఆమె తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లో కీలక పాత్ర వహించినటువంటి జనసేనని పవన్ కళ్యాణ్ యొక్క గౌరవ చిహ్నం అని, ఈ జనసేన జెండా దిమ్మె ఒక గౌరవ ప్రతీక ఆమె తెలిపారు జనసేనని పవన్ కళ్యాణ్ మీద ఎంత గౌరవం ఉందో ఈ జనసేన జెండా దిమ్మె ను కూడా అంతే గౌరవిస్తామని సమన్వయకర్త తంబళ్ళపల్లి రమాదేవి తెలియజేశారు.ఈ కార్యక్రమాన్ని అనాసాగరం గ్రామ ప్రజలు గుండాల బాలాజీ సహకారంతో పెద్ద సంఖ్యలో జనసేన నాయకులు కార్యకర్తలు వీర మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో 20వ వార్డ్ కౌన్సిలర్ తాటి



వెంకటకృష్ణ,చందర్లపాడు మండల అధ్యక్షులు వడ్డెల్లి సుధాకర్,మెల్లంపూడి గోపి(పీఆర్పీ),నల్లగొండ మురళి కృష్ణ,తాటి ఫణింద్ర,రామిరెడ్డి రమేష్,యర్రబడి సురేష్,పుప్పాల భారత్ సాయి,సూర సత్యనారాయణ,కొమ్మినిడి సత్యనారాయణ,వీరమహిళలు కొట్టె వెంకటనరసమ్మ,కరి అనురాధ,కోమలి, గ్రామ పెద్దలు జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలకు ఉద్యాన సిరుల పంట



(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాన్ని కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 645.47 ఎకరాల్లో ఒకేరోజు గ్రౌండింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలన అనే మహాయజ్ఞం జరుగుతోందని.. ఇందులో ఎంపీడీవోలు, ఉపాధి హామీ ఏపీవో, గ్రామ సచివాలయ ఉద్యాన అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితర క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కీలకభాగస్వాములై రైతులను ఉద్యాన పంటల సాగు దిశగా ప్రోత్సహించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంతో ఉచితంగా మొక్కలు పంపిణీతో పాటు నిర్వహణకూ ఆర్థిక సహాయం లభిస్తుందని, పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని రైతులకు క్షుణ్ణంగా వివరించి, ప్రోత్సహించాలన్నారు. డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పనకు కూడా ప్రత్యేక పథకాలు ఉన్నాయన్నారు. ప్రధానంగా ఉపాధి హామీ కార్డులున్నవారు ఒకవైపు పథకం ద్వారా ఉపాధి పొందుతూనే మరోవైపు తమ భూమిలో ఉద్యాన పంటలను సాగుచేసుకొని మంచి ఆదాయం పొందాలని కలెక్టర్ సూచించారు.

**సన్న-చిన్నకారు రైతులకు అద్భుత అవకాశం:**

మామిడి, జామ, నిమ్మ, సపోట, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి, ఆయిల్పామ్, ఆపిల్ బేర్, మునగ, మల్లి, గులాబి తోటల పెంపకానికి సన్న-చిన్నకారు రైతులు (అయిదెకరాల లోపు) అర్హులని.. ఉదాహరణకు మామిడికి ఎకరానికి వివిధ రూపాల్లో రూ. 1,09,950 సాయమందుతుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. జామకు ఎకరానికి రూ. 1,46,971 మేర సాయమందుతుందని, ఎకరంలో 1,600 మల్లె మొక్కల పెంపకానికి దాదాపు రూ. 1,85,396 సహాయం అందించడం జరుగుతుందన్నారు. దానిమ్మకు ఎకరానికి రూ. 2,16,417, డ్రాగన్ ఫ్రూట్కు అర ఎకరానికి రూ. 2,00,714 మద్దతు లభిస్తుందని వివరించారు.

జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో 4,000 ఎకరాలకుపైగా పండ్లు, పూల తోటలు పెంపకాన్ని లక్ష్యంగా నిర్దేశించుకోవడం జరిగిందని..ఇప్పటివరకు మూడు వేల ఎకరాలను ఉద్యాన పంటల సాగుకు గుర్తించడం జరిగిందన్నారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు, సిబ్బంది నిబద్ధతతో కృషిచేయాలన్నారు. మిర్చి, పత్తి, కూరగాయలు, మొక్కజొన్న పంటలతో పాటు గట్ల చుట్టూ కూడా కొబ్బరి, మునగ, నిమ్మ, జామ, దానిమ్మ వంటి వాటిని చేపట్టి అదనపు ఆదాయాన్ని పొందొచ్చని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఆర్డీవో కె.మాధురి, డ్వామా పీడీ ఎ.రాము, సహాయ పీడీ పార్థసారథి, డ్వామా జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ కె.ఉష తదితరులు పాల్గొన్నారు.

# ఏఎంసీ వైస్ చైర్మన్‌గా రాజనాల



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాజనాల వీరబాబు నియామకం జరిగింది. సోమవారం రాత్రి ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు వీరబాబును కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 నుండి జనసేన పార్టీలో జనసైనికులుగా మాతో పాటు పనిచేసిన వీరబాబు సమస్యలపై అనేక పోరాటాలు దీక్షలు చేసి జనసేన పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో ఎంతో కృషి చేశారన్నారు. దానికి గుర్తుగా అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ సూచనల మేరకు కూటమి ప్రభుత్వంలో ఆయనకు ఈ పదవి రావటం చాలా సంతోషకరమన్నారు. ఈ పదవి తొలి నుంచి పార్టీ కోసం కష్టపడిన జనసైనికుడికి ఇచ్చినందుకు మా పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర మత్స్యకార శాఖ కార్యదర్శి లంకె యుగంధర్,,జనసేన పార్టీ సీనియర్ నాయకులు మత్తి సుబ్రహ్మణ్యం, చన్నగిరి సత్యనారాయణ, బచ్చు శ్రీహరి,భోగి రెడ్డి నాగేశ్వరావు అన్నపరెడ్డి ఏసుబాబు ఆళ్లమల్ల చందు బాబు, నాగరాజు, వీరబాబు అభిమానులు పాల్గొని వైస్ చైర్మన్గా ఎంపికైన వీరబాబును పూలమాలలు శాలువాలతో సత్కరించారు.

**అవనిగడ్డ మార్కెట్ కమిటీ ఏకగ్రీవం**

మార్కెట్ కమిటీ చైర్మన్ డైరెక్టర్లుగా కూటమి సభ్యులు ఏకగ్రీవంగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది అవనిగడ్డ మార్కెట్ చైర్మన్ గా కొల్లూరి వెంకటేశ్వరరావును ప్రకటించగా,వైస్ చైర్మన్ గా రాజనాల వీరబాబును సభ్యులుగా విశ్వనాథపల్లి సోమేశ్వరరావు ఉప్పాల శివరాఘవ వర ప్రసాద్ తలసిల లలిత పుప్పాల ఏసు షేక్ పర్వీన మాతంగి వెంకటేశ్వరమ్మ పిల్లి మల్లేశ్వరి కొక్కిలిగడ్డ లక్ష్మి కుమారి జరుగు ఆదినారాయణ కారంకి సరస్వతి మంగళగిరి శ్రీనివాసరావు పిరాటి శిరీష మేరకనపల్లి సురేష్ లను సభ్యులుగా నియమిస్తూ ఆఫీస్ ఆఫ్ ది డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్ జీవో విడుదల చేసింది.

## పొలం పిలుస్తుంది కార్యక్రమం పై అవగాహన



**జగ్గయ్యపేట జులై 8 మేజర్ న్యూస్ :** మండలంలోని వేదాద్రి, పోచంపల్లి గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎడిఎ భవాని మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సీజను కు సంబంధించిన పంటల భీమా కొరకు ప్రీమియం కట్టుకోవలసిందిగా తెలియచేసారు. ప్రత్తి పంటకు ఎకరానికి 1900 రూపాయలు జులై 15 లోపు కట్టుకోవాలని, వరి పంటకు ఎకరానికి 850 రూపాయలు ఆగష్టు 15 లోపు కట్టుకోవాలిని తెలియచేసారు.సొంత భూమి కలిగిన, కౌలు కార్డు పొందిన రైతులు తమ పొలం పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జీరాక్స్ తీసుకొని సమీప మీ సేవ సి ఎస్ సి సెంటర్ లో కాని, సచివాలయం లో కాని, రైతులు సొంతగా ఎన్.సి.ఐ.పి పోర్టల్‌లో కాని నమోదు చేసుకోవచ్చని తెలియచేసారు. పంట రుణాలు తీసుకున్న రైతులకు నేరుగా బ్యాంకు నుండి ఇన్సూరెన్సు ప్రీమియం జమ చేయడం జరుగుతుంది కావున విడిగా చేయవలసిన అవసరం లేదని తెలియచేసారు.అలానే అన్నదాత సుఖీభవ సంబందించిన 10 వ తారీకు వరకు అర్జీలు తీసుకుంటారు కావున అర్హత కలిగిన రైతులు తమ గ్రామంలోని రైతు సేవ కేంద్రం లో నమోదు చేసుకోవలసిందిగా తెలియచేసారు.ప్రస్తుత పంటలలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు తెలియచేసారు.ఈ కార్యక్రమం లో ఎడిఎ భవాని, ఎవో వరలక్ష్మి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మత్తు పానీయాలు అమ్మితే కఠిన చర్యలు



**కోడూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలకి 100 మీటర్ల దూరంలో పచారీ కోర్టులో గాని, బడ్డీ కొట్లో గాని ఎటువంటి పొగాక ఉత్పత్తులను మత్తు పదార్థాలను అమ్మినా కొనిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటా మని కోడూరు మండలం ఎస్ఐ కె చాణిక్య హెచ్చరించారు. ప్రతి చిల్లర దుకాణంలో మత్తు పదార్థాలు చదువుకునే పిల్లలకు అందుబాటులో ఉండటం కారణంగా పిల్లలు చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని ఎస్ఐకే చాణిక్య తెలిపారు.

## కుట్టు మిషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన మండల డెవలప్మెంట్ ఆఫీసర్



**నాగాయలంక జులై 8 మేజర్ న్యూస్ :** నాగాయలంక గ్రామంలో బీసీ కార్పొరేషన్ ద్వారా 90 రోజులు శిక్షణ కార్యక్రమంలో భాగంగా శిక్షణకు నాగాయలంక మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి విచ్చేసిన మహిళా లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమాన్ని మండల డెవలప్మెంట్ ఆఫీసర్ సుధాప్రవీణ్ శిక్షణా కార్యక్రమానికి విచ్చేసి లబ్ధిదారులతో మాట్లాడుతూ పొందుతున్న శిక్షణపై అభిప్రాయాలువారు పొందుతున్న శిక్షణ విధానము గురించి పరిశీలన చేసినారు శిక్షణ అధ్యాపకులు పరిసే కోటేశ్వరమ్మ తో శిక్షణ ఎంతవరకు వచ్చినది అని మాట్లాడుతూ వారికి మంచిగా శిక్షణ ఇవ్వమని తెలియజేసినారు.

## ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమం



**వత్సవాయి :జూలై 8 మేజర్ న్యూస్ :** పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు మండలంలోని ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమం స్థానిక ఎస్సై పి. మహేష్ బాబు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యాసంస్థలు దేవాలయాలకు సమీపంలో ప్రభుత్వ నిషేధిత గుట్కా మత్తు పదార్థాలు అమ్మకాలు జరిగినట్లయితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.మంగళవారం ఆయన పలు దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి 9 మందిని అదుపులోకి తీసుకొని వారికి మొదటి తప్పుగా ఫైన్ విధించి వార్నింగ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఐదు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో మండలంలోని పలు దుకాణాలపై కిరణా షాపులపై తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని కనుక ప్రతి ఒక్కరు బాధ్యతగా నిషేధత పొగాకు సంబంధిత సిగరెట్ గుట్కా గంజాయి వంటి మత్తు పదార్థాలు అమ్మకాలు చేయరాదని హెచ్చరించారు. ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం పై పలువురికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు క్రింది స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ చేయడం పట్ల రెండు గ్రామాల ప్రజల హర్షం

**తోట్లవల్లూరు జూలై 8 మేజర్ న్యూస్:** కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకువచ్చిన మార్పులకు అనుగుణంగా మండల పరిధిలోని బొడ్డపాడు గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాల గాను, అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నూతన ఒరవడితో విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నారని ఆ గ్రామ సర్పంచ్ మూడే శివశంకరరావు పేర్కొన్నారు. బొడ్డపాడు గ్రామం తో పాటు పక్కనే గల చిన్నపులిపాక గ్రామంలోని విద్యార్థులకు కూడా ఈ పాఠశాల ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఎంతోకాలంగా ఈ రెండు గ్రామాల ప్రజలు ఉన్నత పాఠశాల కావాలని ఎదురు చూస్తున్నారని ఇప్పటికి గ్రామస్తుల కోరిక నెరవేరిందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ లకు ఈ సందర్భంగా ఆ రెండు గ్రామాల కు చెందిన తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. తమ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ చేసేందుకు కృషిచేసిన స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజాకు ఈ రెండు గ్రామాల ప్రజలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.







## అధిక మైలేజీతో అత్యధిక లాభాలను అందించే మహీంద్రా ఫ్యూరియో 8

**విజయవాడ మేజర్ న్యూస్ :** మహీంద్రా అధునాతన ప్లాంటులో తయారైన ఫ్యూరియో 8 వాహనం, ఎల్సీవీ సెగ్మెంట్లో వివిధ అవసరాలకు అనుగుణంగా, ప్రధానంగా 4 టైర్ కార్గో, 6 టైర్ కార్గో అనే రెండు వేరియంట్లలో లభిస్తుంది. అత్యధిక లాభదాయకంగా ఉండేలా రూపొందించిన ఫ్యూరియో 8 అనేది తన విభాగంలోని మిగతా వాహనాలతో పోలిస్తే అత్యుత్తమ మైలేజీ, అత్యధిక పేలోడ్ సామర్థ్యాలు, సౌకర్యం, సదుపాయం, భద్రతకు పెద్ద పీట వేస్తూ అధునాతనమైన క్యాబిన్ తదితర ఫీచర్లతో లభిస్తుంది. ఈ విభాగంలో అసామాన్యమైన ప్రయోజనాలను, అత్యధిక లాభాలను అందించే విధంగా ఫ్యూరియో 8 రూపొందించబడింది. అందుకే 'ట్రక్ బద్లో, తక్వీర్ బద్దేగీ' (ట్రక్కును మార్చండి, భవిష్యత్తు మారుతుంది) అనే నినాదం దీనికి చక్కగా సరిపోతుంది. "అత్యధిక మైలేజీని పొందండి లేదా ట్రక్కును వాపసు చేయండి" అనే హామీతో ఆవిష్కరించిన కొత్త మహీంద్రా ఫ్యూరియో 8 శ్రేణి ఎల్సీవీ ట్రక్కుల శ్రేణి, ఈ కేటగిరీ వాహనాలను ఉపయోగించే మా కస్టమర్లు అత్యధిక నిర్వహణ లాభాన్ని ఆర్జించేందుకు ఉపయోగపడుతుంది. శ్రేష్ఠత, కస్టమర్లకు ప్రయోజనాలను చేకూర్చడంలో కొత్త ప్రమాణాలను సృష్టించే విధంగా ఈ కొత్త ట్రక్ సిరీస్ రూపొందించబడింది" అని మహీంద్రా గ్రూప్ యొక్క గ్రూప్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుడు, ప్రెసిడెంట్ (ట్రక్కులు, బస్సులు, సీఈ, ఏరోస్పేస్, డిఫెన్స్) వినోద్ సహాయ్ తెలిపారు.

## అల్ట్రాటెక్ సున్నపురాయి గనికి 5-స్టార్ రేటింగ్



**విజయవాడ మేజర్ న్యూస్ :** సుస్థిర మైనింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్‌కు చెందిన 13 సున్నపురాయి గనులు 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్, గనుల మంత్రిత్వ శాఖ ద్వారా గుర్తింపు పొందాయి. రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఈ నెల 7న జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో ఈ గుర్తింపులను ప్రకటించారు. ప్రతిష్ఠాత్మకమైన 5-స్టార్ గుర్తింపును గెలుచుకున్న గనుల్లో, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న అల్ట్రాటెక్ ఇంటిగ్రేటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్, బాలాజీ సిమెంట్ వర్క్స్‌లో భాగమైన బూదవాడ లైమ్‌స్టోన్ మైన్ ఒకటి. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, భారతదేశంలో అతిపెద్ద సిమెంట్, రెడీ-మిక్స్ కాంక్రీట్ కంపెనీ అయిన అల్ట్రాటెక్‌ను 2023- 24 పనితీరు సంవత్సరానికి సుస్థిరమైన అభివృద్ధి, నిర్వహణ దిశగా ఈ గనులు సాధించిన అత్యుత్తమ విజయాలకు గాను సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమానికి రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ కూడా హాజరయ్యారు.

## గౌతమ్ ఆధ్వర్యంలో సందడిగా వైయస్సార్ జయంతి





**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రైతు బాంధవుడు సంక్షేమ పథకాలతో పేదలకు అండగా నిలిచిన డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు వైసీపీ అభిమాని యువ నేత బడే గౌతం ఆధ్వర్యంలో సందడిగా జరిగింది. మంగళవారం రాత్రి స్థానిక బస్టాండ్ సెంటర్లో ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద భారీగా చేరుకున్న యువత,వైసిపి అభిమానుల నడుమ బాణాసంచా వెలుగులలో వైఎస్ఆర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ ను కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఆదర్శ రైతులు భూపతి రామ్మోహనం రేపల్లె గోపయ్య లనుసత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ నీటి సంఘు అధ్యక్షులు వర్రె బసవరావు, శిర్విశెట్టి శ్రీమన్నారాయణ అద్దంకి శేషు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌కు వడ్లమన్నాడులో ఘన నివాళులు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకలు వడ్లమన్నాడు గ్రామంలో ఘనంగా జరిగినవి. వైఎస్సార్ విగ్రహానికి వడ్లమన్నాడు వైఎస్సార్సీపీ నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కటికల జ్యోతిలత ప్రవీణ్, ఎంపీటీసీ సభ్యులు మండా దిలీప్ కుమార్, కొండలమ్మ గుడి మాజీ చైర్మన్ శేషంగోపి, వైఎస్సార్సీపీ ప్రముఖులు పెన్నేరు ప్రభాకరరావు, గ్రామస్తులు విరివిగా పాల్గొని, దివంగత రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళులర్పిస్తూ జోహార్లు పలికినారు.

## గౌరవరంలో వైయస్సార్76వ జయంతి వేడుకలు



**జగ్గయ్యపేట/ గౌరవరం, జులై 8, మేజర్ న్యూస్ :** గౌరవరం గ్రామంలో ఘనంగా వైయస్సార్ 76వ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా గ్రామ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో గౌరవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు అధూరి కిషోర్ మాజీ సొసైటీ అధ్యక్షులు అన్నా బత్తుల శ్రీనివాసరావు, మండల జనరల్ సెక్రెటరీ మందడపు జగదీష్, జిల్లా కార్యదర్శి వేముల మల్లేశ్వరావు, గ్రామ పార్టీ పెద్దలు, గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు పలువురు యువత పెద్దలు పాల్గొన్నారు.

## కోడూరు మండలంలో..



**కోడూరు మేజర్ న్యూస్ :** మండలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి76జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీజిల్లా కార్యదర్శి కాగితాల సుదర్శన్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గంగాభవానీ ఆలయ సమీపంలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోట కేశవ పెరుమళ్ళుపార్టీ నాయకు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వైయస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలు



**గన్నవరం, జులై 8, మేజర్ న్యూస్ :** ఆరోగ్యశ్రీ అమలు చేసి దేశాన్ని మొత్తం ఆంధ్ర ప్రదేశ్ వైపు చూసేలా చేసిన మోహోన్నత వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని విజయవాడ రూరల్ మండలం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, నిడమానూరు గ్రామ సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. నిడమానూరులోని మూడు బొమ్మల సెంటర్ వద్ద గ్రామ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రంగారావు గ్రామ పార్టీ అధ్యక్షుడు పరిమి వంశీతో కలిసి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు, రైతులకు ముందుగా గుర్తు వచ్చే వ్యక్తి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గత ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి పాలనకు నేడు కూటమి ప్రభుత్వం సాగిస్తున్న సంవత్సర పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాలను ముందు తీసుకెళ్లడం తోపాటు రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, నియోజకవర్గంలో వల్లభనేని వంశీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్క కార్యకర్త సైనికులుగా పనిచేయటానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం గ్రామ పార్టీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పరిమి విష్ణువర్ధన్ రావు, వార్డు మెంబర్ లు కోటేశ్వరరావు, జయకుమారి, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ కోటేశ్వరరావు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ బొప్పన కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# అవనిగడ్డలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** రైతు బాంధవుడు, ఆంధ్ర కాటన్ దొర, మహానేత దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకలను,రైతు దినోత్సవాన్ని అవనిగడ్డ లో ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్ఆర్సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, యువ నాయకుడు సింహాద్రి వికాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. రైతు దినోత్సవం సందర్భంగా పలు రైతులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం బస్టాండ్ సమీపంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ మరుపురాని మహానేత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అన్నారు రైతే రాజు అని మహానేత జయంతి పురస్కరించుకొని మంగళవారం ఆదర్శ రైతులకు పట్టు వస్త్రాలతో సత్కరించారు రాజకీయాలలో ఓటమి ఎరుగని మహా నాయకుడు అని ఆయన పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని 108 104 ఆరోగ్యశ్రీ ఫీజు రీయింబర్స్మెంట్ వంటి మహోత్తరమైన పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత ఆంధ్ర కాటన్ దొర వైయస్ అన్నారు ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యంలోని రోగులకు రొట్టె పండ్లు పాలు పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోరుముచ్చు ఉమా ఎంపీపీ తుంగల సుమతి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, వైయస్సార్ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు, రాష్ట్ర పార్టీ ప్రచార విభాగం కార్యదర్శి గాజుల జై గోపాల్, సర్పంచ్ వాకా రమేష్, ఎస్సీ సెల్ జిల్లా గుర్రం బసవయ్య తో పాటు నియోజకవర్గంలోని వివిధ హోదాలలో ఉన్న పార్టీ నేతలు కార్యకర్తలు వైఎస్ఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పామర్రులో ఘనంగా వైయస్సార్ జయంతి వేడుకలు



**పామర్రు జులై 8 మేజర్ న్యూస్:** మాజీ ముఖ్య మంత్రి స్వర్గీయ డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జ యంతి వేడుకలను వైయ స్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో పామర్రు లో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, స్థానిక మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ముందుగా పార్టీ కార్యాలయంలో వైయ స్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి మోటార్ సైకిళ్ళ పై ర్యాలీగా పామర్రు గ్రామంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా కార్య కర్తలు జోహార్ వైయస్ఆర్, జై జగన్ అంటూ పెద్ద ఎత్తున నినా దాలు చేశారు. అనంతరం అనిల్ కుమార్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, వైస్ ఎంపిపిలు ఆరుమళ్ళ రమాదేవి, ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఆరుమళ్ళ శ్రీనాథ్ రెడ్డి, బాల వెంకటేశ్వర రెడ్డి లతోపాటు పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పమిడిముక్కల మండలంలో ..



**పమిడిముక్కల జులై 8 మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత ముఖ్య మంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకలను పమిడిముక్కల మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని పమిడిముక్కల, వీరంకిలాకు, కపిలేశ్వరపురం గ్రామాల్లో వైయస్సార్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వర్గీయ వైయస్సార్ ఆశయాలకు అనుగుణంగా మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ నాయకత్వంలో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా నాయకులు ప్రకటించారు. అలాగే దేశంలో సంక్షేమ విప్లవం తీసుకువచ్చిన మహా వ్యక్తి వైయస్సార్ అని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు యలమంచిలి గణేష్, జెడ్పిటిసి సభ్యురాలు ఏనుగు వెంకటరమణ కుమారి, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షులు పాతూరి చంద్రపాల్, బొల్లా సాంబశివరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శిలు గొర్కిపూడి బుజ్జి, కోడిబొయిన కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, వంశీ, ఆదిశేషు, యేనుగ మస్తాన్ రావు, తిరుమలశెట్టి బోసుబాబు, స్థానిక నాయకులు బొల్లా రాంబాబు, కూరపాటి రాణి, కొడాలి సొమేశ్వరరావు, పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆదర్శ ముఖ్యమంత్రికి చిరునామా వైయస్సార్

### మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు

**కంచికచర్ల జులై 8 మేజర్ న్యూస్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆదర్శ ముఖ్యమంత్రి కి చిరునామా వైయస్ రాజశేఖర్ రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు ప్రశంసించారు. మంగళవారం వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు కంచికచర్ల లో ఘనంగా నిర్వహించారు. స్థానిక నెహ్రూ సెంటర్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైయస్ విగ్రహానికి మొండితోక పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు నాయకులు,కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం 1వ వార్డులో, అంబేద్కర్ కాలనీ లో ఉన్న డాక్టర్ వైయస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అరుంధతి కాలనీ లో ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి ఫ్లెక్సీ వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు సానుభూతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గుడ్లవల్లేరులో వైఎస్సార్ 76వ జయంతి



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరులో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర రెడ్డి 76వ జయంతిని మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో ఘనంగా జరిపారు. వైఎస్సార్ వంతెనపై గల వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్ సేవలను స్మరిస్తూ జన హృదయనేతగా మా గుండెల్లో ఎల్లప్పుడూ నిలిచివుంటారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచోపెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు కృష్ణా జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కోటప్రోలు నాగు, జిల్లా కెడిసిసి బ్యాంకు మాజీ డైరెక్టర్ పడమట సుజాత, గుడివాడ నియోజకవర్గ పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షులు పిన్నమనేని రాఘవేంద్రరావు, మండల యూత్ అధ్యక్షులు గుదే రవి, కొండలమ్మ దేవస్థానం మాజీ ధర్మకర్త ఢోకాల భాగ్యలక్ష్మి, వైఎస్సార్సీపీ ప్రముఖులు పామర్తి రామ్మోహనరావు, మేకల అనిల్, పెనుమాల రంగారావు, దోమతోటి గోపి, మిరియాల రాజేంద్రప్రసాద్, కొనాల ప్రసాద్, కొడాలి సుధాకర్, పోస్టల్ రాజు, రేమల్లి ప్రసాద్, కొనాల లూథర్, పడమట నాంచారయ్య, కుందేటి ఫణి, కొడాలి శివ, గెద్దాటి ప్రసన్న, గెద్దాటి నాగరాజు, అజయ్ బాబు, దుర్గారావు, జోజిబాబు, పఠాన్ అన్వర్ భాషా తదితరులు పాల్గొని జోహార్ వైఎస్సార్, వర్ధిల్లాలి వైఎస్ జగన్ నాయకత్వం అంటూ నినాదాలతో హోరెత్తించారు.

# గుడ్లవల్లేరు టీడీపీ నేతల "సుపరిపాలనలో తొలి అడుగు"

## ఇంటింటికీ కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు

## కూటమి ప్రభుత్వ పాలన భేష్ అంటున్న గుడ్లవల్లేరు ప్రజలు



**గుడ్లవల్లేరు జూలై 08 మేజర్ న్యూస్:** గుడ్లవల్లేరు గ్రామంలో 186, 187 బూత్ లందు "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర తెలుగు దేశం పార్టీ పిలుపుమేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో గుడ్లవల్లేరు తెలుగుదేశం పార్టీ ప్రముఖులు ఇంటింటికీ వెళ్ళి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని సంవత్సరకాల కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, అమలు తీరు, ఆ కుటుంబ సభ్యుల లబ్ధి వివరాలను వివరించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు, మాజీ జిల్లా టీడీపీ అధ్యక్షులు వల్లభనేని బాబురావు, గుడ్లవల్లేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పొట్లూరి రవి కుమార్, మాజీ జడ్పీటీసీ జంగం మోహన రావు, జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ శాయన పుష్పావతిలు మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం, కూటమి ప్రభుత్వ పాలన జనరంజకంగా, భేషుగ్గా వుందన్నారు. గుడ్లవల్లేరు గ్రామ పార్టీ అధ్యక్షులు వల్లభనేని రంగబాబు, టిడిపి ప్రముఖులు పోలవరపు వెంకట్రావు, ఎనిగళ్ళ నాగేశ్వరావు, కోలా రాధాకృష్ణ, పల్లెం నరసింహారావు, దేవిశెట్టి రామకృష్ణ, కోగంటి రాధాకృష్ణ, బొర్రా నాగేశ్వరరావు, రావాడ గోపాల్, కోండ్రు కోటేశ్వరరావు, బండి సత్యనారాయణ, శివాజీ, ఈదా కొండయ్య, సత్యనారాయణ, బూత్ ఇంచార్జ్ లు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## కట్లేరు వంతెనను పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే



**గంపలగూడెం మేజర్ న్యూస్ :** నియోజవర్గంలో మంగళవారం పలు కార్యక్రమాల్లో పాల్గొనటానికి విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలిక పూడి శ్రీనివాసరావు, మండల నాయకుల తోకలిసి కట్లేరు వంతెను పరిశీలించారు. 2018లో ధ్వంసమైన కట్లేరు వంతెనను గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహించింది. ఎన్నికల్లో చెప్పిన విధంగా కట్లేరు వంతెనను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు మొదలు పెట్టింది. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తో కలిసి రూ.30 కోట్లు విడుదలయ్యేందుకు కృషి చేసినట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. త్వరలోనే ఈ వంతెన పనులు ప్రారంభం కానున్నాయని, ప్రజల కష్టాలు తీర్చేందుకే ఎన్డీయే కూటమి ప్రభత్వం పనిచేస్తుందని ఎంపీ కేశినేని శివనాథ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్ నియోజకవర్గ అబ్జర్వర్ సుఖవాసి శ్రీనివాసరావు గారు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు , తిరువూరు ఏఎంసీ చైర్పర్సన్ రేగల లక్ష్మీ అనిత , గంపలగూడెం మండల పార్టీ అధ్యక్షుడు మానికొండ రామకృష్ణ , విస్సన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు రాయల సుబ్బారావు , తిరువూరు పట్టణ అధ్యక్షుడు మల్లెల శ్రీనివాసరావు, మండల నాయకులు రేగళ్ల వీరారెడ్డి లతో పాటు తదితరులు పాల్గొన్నారు

## హెల్త్ అసిస్టెంట్‌కు బదిలీ అయిన సందర్భంగా సూరిబాబుకు ఘనంగా సన్మానం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మంగళవారం తాళ్లపాలెం ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో బట్రాజు సూరిబాబు హెల్త్ అసిస్టెంట్ కు బదిలీ అయిన సందర్భంగా సూరిబాబుకు తాళ్ల పాలెం ఆసుపత్రి స్టాఫ్ ఘనంగా సన్మానం చేసినారు.

## స్పెషల్ పార్టీ సిబ్బంది తమ యొక్క విధుల పట్ల నిబద్ధత కలిగి సమయపాలన కలిగి ఉండాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, సమాచార సేకరణలో కీలక పాత్ర పోషిస్తున్న స్పెషల్ పార్టీ సిబ్బందికి మంగళవారం జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు బ్రీఫింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎస్పీ ఆర్ గంగాధరరావు మాట్లాడుతూ స్పెషల్ పార్టీ సిబ్బంది తమ యొక్క విధుల పట్ల నిబద్ధత కలిగి సమయ పాలన, సమయస్ఫూర్తి కలిగి ఉండాలని ఏ సమయం అయినా ఎలాంటి పరిస్థితులలోనైనా విధుల పట్ల నిబద్ధత కలిగి ఉండాలని తెలిపారు. విధులు నిర్వర్తించే సమయంలో ప్రజలతో మర్యాదపూర్వకంగా, సహనంతో వ్యవహరించాలని స్పష్టమైన సూచనలు చేశారు. బందోబస్తు నిర్వహించే సమయంలో అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే ఎప్పటికప్పుడు పై అధికారులకు ఆ సమాచారాన్ని తెలియజేస్తూ ముందస్తు చర్యలు తీసుకో వడంలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. వృత్తిపరమైన, వ్యక్తిగతమైన క్రమశిక్షణ పాటిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్ట పెంపొందించే విధంగా విధులు నిర్వర్తించాలి. అని అన్నారు.

### ఇంటికో మొక్క ప్రతి పౌరుని బాధ్యత కార్యక్రమానికి

## జిల్లా ఎస్పీకి ఆహ్వానం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ లక్ష్మణ స్వామి వితరణతో జూలై 13ఆదివారం హిందూ కళాశాల ఎదురుగా జరుగుతున్న ఇంటికో మొక్క ప్రతి పౌరుని బాధ్యత కార్యక్రమానికి కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధర్ రావుని కలిసి ఆహ్వానించిన సహాయ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షులు ఉస్మాన్ భాషా తదితరులు

## సింగలూరు చెరువు హద్దుల్లో కాంక్రీట్ పిల్లర్ల ఏర్పాటు

### సర్పంచ్, పోలీసులు, గ్రామస్తుల సమక్షంలో..



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** సింగలూరు మంచినీటి చెరువు హద్దుల్లో కాంక్రీటు పిల్లర్లను చంద్రాల పంచాయతీ సర్పంచ్ కలిశెట్టి అర్జునరావు, సింగలూరు గ్రామస్తులు కలసి మంగళవారం నిర్మాణం చేస్తున్నారు. గ్రామస్తులు చెరువు భూమిని సర్వే చేయాలంటూ మండల తహశీల్దారు బి. లోకరాజుకు చేసుకున్న విన్నపంపై గత జూన్ 25 మంగళవారం మండల సర్వేయరు పర్వీన్ సుల్తానా ఆధ్వర్యంలో, విఆర్వో భాస్కరరావు, సర్వే సిబ్బంది సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తుల సమక్షంలో సర్వేచేసి హద్దులు నిర్ణయించి, సర్వే రాళ్ళను ఏర్పాటు చేశారు. వాటిని పటిష్టం చేస్తూ మంగళవారం సిమెంట్ కాంక్రీటు పిల్లర్లను నిర్మాణం చేస్తున్న గ్రామస్తులు అతిత్వరలోనే పశువులు, పందులు, అపరిశుభ్రమైనవి మంచినీటి చెరువుపైకి రాకుండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మంచినీటి చెరువు హద్దుల్లో ఎటువంటి వివాదాస్పదమైన అంశాలు చోటుచేసుకోకుండా గుడ్లవల్లేరు పోలీసు సిబ్బంది హాజరవడం విశేషం. సర్పంచ్ కలిశెట్టి అర్జునరావు, సంఘసేవకులు డాక్టర్ బండారు శ్యామ్ కుమార్, తుమ్మలచర్ల లక్ష్మణరావు, నందం రమేష్, మల్లేశ్వర రావు, పైడేశ్వరరావు, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు

## 10న శ్రీ కొండలమ్మకు "ఆషాఢ మాస సారె మహోత్సవం"

### ముఖ్య అతిథిగా ఎంఎల్ఏ వెనిగండ్ల రాము, అమ్మవారికి సారె సమర్పణ





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం వేమవరంలో వేంచేసియున్న శ్రీకొండలమ్మ అమ్మవారికి జూలై 10వతేదీ గురువారం "ఆషాఢ మాసం సారె మహోత్సవం" నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. శ్రీ కొండలమ్మ అమ్మవారిక ఆషాఢ మాసం సారె మహోత్సవంకు ముఖ్య అతిథిగా గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము విచ్చేసి, శ్రీ అమ్మవారికి ఆషాఢ మాసం సారె (పట్టు వస్త్రాలు) సమర్పిస్తారని ఈఓ కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు యావన్మందీ పాల్గొని "ఆషాఢ మాసం సారె మహోత్సవం"ను జయప్రదం చేసి అమ్మవారి ఆశీస్సులకు పాత్రులు కావాలని ఈఓ కొండలరావు కోరారు..

## బాలుని వైద్య ఖర్చులకు మానవత సేవా సంస్థ చేయూత



**పామర్రు జులై 8 మేజర్ న్యూస్:** మానవసేవే మాధవసేవ సూక్తి కి అనుగుణంగా అవసరమైన వారికి తగువిధంగా సేవలు అందిస్తున్నామని పామర్రు మానవత సేవ సంస్థ అధ్యక్షులు ఎన్.త్రివిక్రమరావు తెలిపారు. పామర్రు కొరముక్కువాని పురం దళితకాలనీ లోని కంచర్ల ప్రసన్న కుమార్ కుమారుడు సంవత్సరం వయసుగల బాలాదిత్య వైద్య చికిత్సల నిమిత్తం 6,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని మంగళవారం స్థానిక మానవత కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమం లో మానవత రీజియన్ చైర్మన్ పిఎంఎస్ ప్రసాద్, పామర్రు చైర్మన్ సీతాల ప్రసాద్, డైరెక్టర్ లు కేశన రవీంద్ర బాబు, మండపాక సుబ్బారావు, డొక్కు సుబ్రహ్మణ్యం, అల్లాడ సోమశేఖర్, బొండు సుధాకర్, బొమ్మారెడ్డి కోటిరెడ్డి తదితరులు పాల్గొని ఆర్థిక సహాయాన్ని అందించారు.

## 10న పాఠశాలల్లో "మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్"

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ జూలై 08 :** గుడ్లవల్లేరు మండలంలో ఉన్న 71 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జూలై 10 వతేది గురువారం రోజు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు "మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్" జరుపనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు జి. జగన్మోహనరావు, జి. గోపాల రావు లు తెలిపారు. ఆయా పాఠశాలల మెగా పేరెంట్ టీచర్స్ మీటింగులో ప్రతి విద్యార్థి యొక్క తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు గ్రామపెద్దలు, దాతలు, విద్యాభిమానులు, కళాకారులు అందరూకూడా విధిగా పాల్గొనవలసినదిగా గుడ్లవల్లేరు ఎంఇఓ-1 జి. జగన్మోహనరావు, ఎంఇఓ-2 జి. గోపాలరావులు కోరారు.

## స్వంత నిధులతో కాలువ పూడికచేత పనులు చేపట్టిన జనసేన నేత కిరణ్



**పమిడిముక్కల జులై 8 మేజర్ న్యూస్ :** రైతుల అవసరాలను గుర్తించి తన స్వంత నిధులతో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు సనకా కిరణ్ పంట కాలువ అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండల పరిధిలోని మంటాడ 4వ వార్డు, ఫైర్ స్టేషన్ రోడ్డు, జాతీయ రహదారి నుండి మంటాడ ఎస్సీ కాలనీ స్మశానం వరకు పోవు అడ్డకోటు కాలువ పూర్తిగా పూడిపోయి సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పలువురు రైతులు సాగునీరు రాక తాము పడుతున్న ఇబ్బందులను మండల జనసేన పార్టీ అధ్యక్షుడు, మొవ్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సనకా కిరణ్ దృష్టికి తీసుకువచ్చి సహకారం అందించాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన కిరణ్ స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా దృష్టికి సమస్యను తీసుకువెళ్లి, ఆయన ఆదేశాలతో తన స్వంత నిధులు సుమారు పదివేల రూపాయల వ్యయంతో అడ్డకోటు కాలువ పూడికతీత పనులను చేపట్టారు. తమ ఇబ్బందులను కిరణ్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి పూడిక తీత పనులు చేపట్టినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ, ఆయనకు రైతులు తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, ఎంపీటీసీ సభ్యులు కూనపరెడ్డి సుబ్బారావు, కుర్ని రాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## శ్రీ కొండలమ్మకు ట్రైనీ కలెక్టర్ ఫరీద్ బేగం పూజలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** మండల రెవెన్యూ కార్యాలయంలో శిక్షణ నిమిత్తం ట్రైనీ కలెక్టర్ ఫరీద్ బేగం మంగళవారం గుడ్లవల్లేరు విచ్చేసారు. ఈ సందర్భంగా తహశీల్దార్ లోకరాజు, కార్యాలయం సిబ్బంది, విఆర్వో లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తొలుత ట్రైనీ కలెక్టర్ ఫరీద్ బేగం వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ దేవస్థానంకు విచ్చేసి ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ట్రైనీ కలెక్టర్ ను సత్కరించి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేసినారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.లోకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒరిగిన ధ్వజస్తంభం ఆందోళనలో గ్రామస్తులు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** బాల కటేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభం శిఖర భాగం శిథిలమై ఓవైపుకు ఒరిగిపోయి పడిపోవడానికి సిద్ధంగా ఉండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని పాత ఎడ్లంక గ్రామంలో వేంచేసి ఉన్న బాల కోటేశ్వర స్వామి వారి దేవస్థానం ధ్వజస్తంభం పైభాగం ఒకవైపు ఒరిగి విరిగేందుకు సిద్ధంగా ఉండడంతో భక్తులు, పాదచారులు దేవాలయం చుట్టూ నడవడం గాని ప్రదక్షిణ చేయడం గాని చేయకూడదని దేవాదాయ శాఖ ఆలయ కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రమాదంగా మారిన ఆలయ ధ్వజ స్తంభాన్ని శాస్త్రోక్తంగా తొలగించి నూతన ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైయస్సార్ జయంతి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** అత్యంత ప్రజాదరణ పొందిన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ నేత దివంగత డాక్టర్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్లో గల రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి జోహార్ వైయస్సార్ అంటూ నినాదాలు చేస్తూ ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గ ఇన్చార్జ్ అందె శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు నరహరిశెట్టి శ్రీమన్నారాయణ కోడూరు మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటేశ్వరరావు జిల్లా నాయకులు గౌస్ తో పాటు పలువురు నేతలు వైఎస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గోళ్ళ వెంకట సుబ్బారావు ఆది రామ్మోహన్ రావులు మాట్లాడుతూ ప్రజాసేవ చేయాలనుకునే ఎందరో రాజకీయ నేతలకు స్ఫూర్తిదాయకం మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు అభయ హస్తం ద్వారా 60 సంవత్సరాలు నిండిన తల్లులకు పెన్షన్ పథకం ఫీజు రాయితీతో 5 లక్షల వరకు పావలా వడ్డీకి డ్వాక్రాలను వంటి మహోత్తర పథకాలను ప్రవేశపెట్టిన మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి అని నేడు ఆంధ్ర రాష్ట్రం నిత్యం దేవుళ్ళ లా కొలుస్తుంది అన్నారు.

## రైతుకు ఉపాధి భవిష్యత్తుకు భరోసా




**రెడ్డిగూడెం, జూలై 8, మేజర్ న్యూస్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పొలాల్లో పండ్లతోటల పెంపక కార్యక్రమంకు మండల పరిధిలోగల శ్రీరాంపురం లో శుభారంభం జరిగింది. ఈ ప్రారంభోత్సవంలోసర్పంచ్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకాన్ని నిజమైన అభివృద్ధి పథంగా మార్చేందుకు ఇది ఒక అద్భుతమైన ముందడుగు అని పేర్కొన్నారు. రైతులకు ప్రత్యక్ష లాభాన్ని చేకూర్చే ఈ కార్యక్రమంలో భాగంగా, మామిడి, జామ, నేరేడు, సీతాఫల, అవకాడో లాంటి పండ్ల చెట్లను రైతుల పొలాల్లో నాటనున్నారు. ఇవి తక్కువ నీటితో పెరిగి, 2,3 ఏళ్లలో ఆదాయాన్ని అందించే శాశ్వత ఆస్తులుగా మారుతాయని సర్పంచ్ వివరించారు. ఈ రోజు చెట్టు నాటితే, రేపటి తరం జీవనం నిలబడుతుంది. అంటూ ఆయన హృదయాన్ని హత్తుకునే సందేశం ఇచ్చారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు లభించే ప్రయోజనాలు మూడు ముఖ్యంగా ఉన్నాయి. ఖరీఫ్, రబీ మధ్యలో ఉపాధి. పొలాల్లో శాశ్వత పంటల ఏర్పాటుతో భవిష్యత్ ఆదాయం గ్రామీణ మహిళలకు, కూలీలకు పనితో పాటు గౌరవం ఈ కార్యక్రమం రైతు కుటుంబాల ఆర్థిక భద్రతకు మార్గం వేస్తుందనే విశ్వాసంతో రైతులు, కూలీలు, మహిళలు హర్షాతిరేకంగా పాల్గొన్నారు. ఇది కేవలం చెట్టు నాటకం కాదు రైతు జీవితంలో భరోసాను నాటడం అంటూ పలువురు వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పథకాల సమర్థ వినియోగం కలిసొస్తే, గ్రామీణ వ్యవసాయానికి నూతన ఊపునిస్తుందని స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ సభ్యులు మారయ్య, గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు డేవిడ్, ఉప సర్పంచ్ ఇందిర, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రాధ కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాయీబ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం

### ఏఐబీఎస్పీ జాతీయ సమన్వయకర్త డాక్టర్ జె. పూర్ణచంద్రరావు



**విజయవాడ, జూలై 8, మేజర్ న్యూస్ :** తిరుమలలోని వేంకటేశ్వరుని కళ్యాణం నుంచి మండపాల్లో జరిగే సామాన్యుల పెళ్లిళ్ల వరకు ఎక్కడైనా మంగళ వాయిద్యాలు అంటే నాయీబ్రాహ్మణులే వాయిస్తారని.. అలాంటి నాయీబ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాల్సిన తరుణం ఇప్పుడు ఆసన్నమైందని ఏఐబీఎస్పీ జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ డాక్టర్ జె. పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. విజయవాడ రాఘవేంద్ర థియేటర్ సమీపంలోని పండూరి సంగయ్య నాయీబ్రాహ్మణ కళ్యాణమండపంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ వృత్తిదారుల గౌరవ రక్షణ చట్టం కోసం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "ఈమధ్య ఎక్కడ చూసినా కార్పొరేట్ సెలూన్లు కనిపిస్తున్నాయి. ఏసీ పెట్టి, భారీ ఏర్పాట్లు చేసి అందరినీ ఆకర్షించేలా చేస్తున్నారు. అక్కడ కేవలం జుట్టు కత్తిరించడం, గడ్డం చేయడమే కాక మసాజ్, ఫేషియల్ ఇలా చాలా చేస్తున్నారు. కానీ కొన్నిచోట్ల ఇవి వ్యభిచార కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి. నాయీబ్రాహ్మణ కులవృత్తి ఎంతో గౌరవప్రదమైనది. ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో అత్యవసరమైనది. కానీ తాతముత్తాతల కాలం నుంచి కొనసాగుతూ వస్తున్న ఈ వృత్తిలో ఉన్న గౌరవాన్ని మంటగలిపేలా వస్తున్న ఈ కార్పొరేట్ తరహా సెలూన్లను అడ్డుకోవాలి. మంగళకరమైన పనికి కళంకం తెస్తున్న కార్పొరేట్ సెలూన్లను అడ్డుకోకపోతే రాబోయే రోజుల్లో మామూలు సెలూన్లను కూడా అనుమానంగా చూసే పరిస్థితి వస్తుంది. ఇక ఉత్తర్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుంచి వచ్చిన ఒక వర్గం వాళ్లు నిర్వహించే సెలూన్లలో తుపాకులు కూడా అమ్ముతున్నట్లు సమాచారం వస్తోంది. ఇదే కొనసాగితే రేపు మొత్తం నాయీబ్రాహ్మణ కులస్థులు అందరినీ అనుమానంతో చూసే పరిస్థితి ఏర్పడుతుంది. అందువల్ల ఇప్పటికైనా నాయీబ్రాహ్మణులందరూ ఏకతాటి మీద నిలబడాలి. సమైక్యంగా ఉండి, మీకు ఎదురవుతున్న సమస్యలపై పోరాడాలి. ఎవరైనా మెడికల్ షాపు పెట్టుకోవాలంటే బీ-ఫార్మసీ లాంటి డిగ్రీలు ఉంటేనే లైసెన్సు ఇస్తారు. అలాగే ఇప్పుడు సెలూన్లు పెట్టుకోవాలన్నా కూడా తప్పనిసరిగా నాయీబ్రాహ్మణ కుల ధ్రువీకరణ పత్రం ఉండేలా ప్రభుత్వం చట్టం చేయాలి. అంతే కాదు.. మనకు చట్టబద్ధంగా వచ్చిన రిజర్వేషన్లలో వాటానను కూడా ఈడబ్ల్యుఎస్ పేరుతో కమ్మ, రెడ్డి లాంటి అగ్రకులాల వాళ్లు తీసేసుకుంటున్నారు. ఇప్పటివరకు ఒక్క బీసీ అయినా ముఖ్యమంత్రి అయ్యారా? ఎప్పుడూ ముఖ్యమంత్రి పదవుల్లే వారే ఉంటున్నారు. అయినా కూడా ఆ కులాలకు ఈడబ్ల్యుఎస్ పేరుతో రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వాలి? ఇలాంటి అంశాలన్నింటిపైనా సమైక్య పోరాటం చేయాల్సిన తరుణం అసన్నమైంది. మీరంతా నల్లచొక్కాలు, నల్ల టీషర్టులు వేసుకుని 40 రోజుల మండల దీక్ష చేయండి. మిగిలిన బీసీలందరూ కూడా మీవెంటే వస్తారు. తమిళనాడులో ఇలాంటి ఉద్యమంతోనే డీఎంకే ఉద్భవించింది. అక్కడ స్టాలిన్ ముఖ్యమంత్రి అయినట్లే ఇక్కడ మీ నుంచి ముఖ్యమంత్రి వస్తారు. కులం అనేది అస్తిత్వం.. దీన్నే ఆస్తిగా మార్చుకోండి. ఎక్కడున్నా, ఏ పార్టీలో ఉన్నా మీ కులం కోసం పనిచేయండి. మనం ఎంతమంది ఉన్నామో ఈ దేశ సంపదలో, ఈ రాష్ట్ర సంపదలో అంత మన వాటా ఉంటుంది. దాన్ని సాధించుకోవడానికి ఉద్యమించండి" అని పిలుపునిచ్చారు. రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఏఐబీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త పరంజ్యోతి మాట్లాడుతూ, "గతంలో ఒకసారి ఈ వృత్తిదారుల మీద దాడులు జరిగితే అందరూ సమైక్యంగా చేసిన ఉద్యమాల ఫలితంగా ప్రభుత్వంలో ఈ కులం అంటే ఒక గౌరవం ఏర్పడింది. వీరంతా తెగువ చూపడం వల్లే ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ ఏర్పడింది. పంచాయతీలు, మునిసిపాలిటీల్లో నాయీబ్రాహ్మణులకు దుకాణాలు కేటాయించాలని జీవో-14 జారీచేశారు. మునిసిపాలిటీలు, పంచాయతీల్లో ఖాళీ స్థలాలు ఉంటే, బంకు పెట్టుకోవడానికి నాయీ బ్రాహ్మణులకు స్థలం కేటాయించాలని జీవో-13 ఇచ్చారు. ఇవన్నీ ఉద్యమిస్తేనే వచ్చాయి. అందువల్ల ఇప్పుడు కూడా అదే స్ఫూర్తిని అందిపుచ్చుకుని ఉద్యమించాలి" అని సూచించారు. ఇతర కులాలు, మతాలు, రాష్ట్రాలకు చెందినవాళ్లంతా ఇప్పుడు మన రాష్ట్రానికి వచ్చి, ఇక్కడ కార్పొరేట్ సెలూన్లు పెడుతూ అనైతిక, అక్రమ కార్యకలాపాలు చేస్తుంటే నాయీ బ్రాహ్మణ కులస్థులంతా ఏం చేస్తున్నారని సీనియర్ పాత్రికేయుడు అన్నవరం బ్రహ్మయ్య ప్రశ్నించారు. గతంలో ఈ కుల నాయకులు ఉమ్మడిగా ఉద్యమించడం ద్వారానే అనేక హక్కులు సాధించుకున్నారని, ఇప్పుడు కూడా మరోసారి ఆత్మగౌరవ నినాదంతో ముందుకొచ్చి, ఉద్యమించుకునేందుకు ఒక స్టీరింగ్ కమిటీని ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంకా.. నాయీబ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాక్షారపు సూరిబాబు, ఏఐబీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరణికోట లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిద్ధమవుతున్న బిల్డింగ్ కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్

**కంచికచర్ల జులై 8 మేజర్ న్యూస్ :** కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జులై 9న జరుగుతున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సమ్మె గోడ పత్రికను మంగళవారం విడుదల చేశారు. కంచికచర్ల మండల బిల్డింగ్ కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ గ్రామ కమిటీలు, భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐ ఎఫ్ టి యు ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ బిసి డబ్ల్యు యు 9వ తారీకు న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె గోడపత్రికను కంచికచర్ల మండల బిల్డింగ్ కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ గ్రామ కమిటీ ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియుజిల్లా అధ్యక్షులు జి హరికృష్ణ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిలుపుదల చేసేందుకు గత ప్రభుత్వం ఇచ్చిన మెమో 12 14 రద్దుచేసి, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధించి, గడిచిన ఆరు సంవత్సరాలుగా ప్రమాదాల బారిన పడ్డ కార్మికులకు ఇవ్వవలసిన నష్టపరిహారం తక్షణమే కార్మికుల అకౌంట్లో వేయాలని అన్నారు. కూటమి సర్కారు అధికారంలోకి రాకముందు మేము అధికారంలోకి వస్తే భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన సంక్షేమ బోర్డు అమలు గురించే మాట్లాడని రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై జులై 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను భవన నిర్మాణ కార్మికులందరూ జయప్రదం చేయాలని కోరారు. సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సంక్షేమ బోర్డును అమలు చేయించుకునేందుకు మన సమస్యలను పరిష్కరించుకునే విధంగా మన ఐక్యతను సమ్మె ద్వారా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ కంచికచర్ల మండల అధ్యక్ష,కార్యదర్శులు లక్కి శెట్టి ఆంజనేయులు, కంభంపాటి శీను, బడేటి దాసు, బండారు శీను, కంభంపాటి మాధవ, చింతగుంట్ల కోటేశ్వర రావు, మద్రిపూడి చిన్న కృష్ణారావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## వెంకటాపురంలో రైతులకు పులగ విత్తనాలు పంపిణీ



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి కొండూరు మండలం వెంకటాపురం గ్రామంలో శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు వెంకటాపురం గ్రామం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుకేసరి వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ రైతులకు పులగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లోఎన్డీఏ కూటమి నాయకులు,గ్రామ పంచాయతీ సెక్రెటరీ బసవ లింగేశ్వర గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామ ఐటీడీపీ కోఆర్డినేటర్ దొంతి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ప్రారంభమైన పవిత్రోత్సవాలు..



**జగ్గయ్యపేట/ వేదాద్రి, జూలై 8,మేజర్ న్యూస్ :** వేదాద్రి గ్రామములో పావన కృష్ణానది తీరమున పంచనారసింహ క్షేత్రమై వెలసియున్న శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానము లో స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఆషాడ శుద్ధ త్రయోదశి మంగళవారం అనగా ది. 08-07-2025 నుండి ప్రారంభమయి బహుళ పాడ్యమి అనగా 11-07-2025 వరకు త్రయహ్నిక దీక్షా విధానమున శ్రీ వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం పవిత్రోత్సవములు నిర్వహించు కార్యక్రమములో భాగంగా మొదటి రోజు రాత్రి గం.7.30 ల నుండి విస్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మ్రుద్రహణ, అంకురార్పణ, వస్తూపూజ, వాస్తుహోమములు ప్రారంభమగును. కావున భక్తులెల్లరు '4' రోజులు నిర్వహించబడు ఈ పవిత్రోత్సవ కార్యక్రమములో పాల్గొని శ్రీ స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించవలసినదిగా దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణఇందిరాదత్తు, దేవస్థాన కార్యనిర్వహణా ధికారి కానూరి సురేష్ బాబు తెలియజేసినారు.

# కూచిపూడి నృత్య దుస్తులు, గజ్జలకు విస్తృతంగా మార్కెటింగ్ సౌకర్యం





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కూచిపూడి గ్రామ మహిళలు తయారుచేసిన కూచిపూడి నృత్య దుస్తులు, గజ్జలకు విస్తృతంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లో నగరంలోని వారి చాంబర్లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డి ఆర్ ఓ కే చంద్రశేఖర రావుతో కలిసి కూచిపూడి గ్రామ అభివృద్ధి పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కూచిపూడి గ్రామంలోని 25 మంది స్వయం సహాయ సంఘాల మహిళలకు జీవనోపాదులలో భాగంగా కూచిపూడి నృత్య దుస్తులు, గజ్జలు తయారీ పై శిక్షణ తీసుకొని ఆ సామాగ్రిని తయారు చేయడం జరిగిందన్నారు. కూచిపూడి గురువులకు తెలియజేసి కూచిపూడి గ్రామ మహిళలు తయారుచేసిన కూచిపూడి దుస్తులు, గజ్జలు కొనుగోలు చేసే విధంగా కృషి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు కూచిపూడి గ్రామ మహిళలు తయారుచేసిన దుస్తులు, గజ్జలు కొనుగోలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా అమెజాన్ తో అనుసంధానమై కూడా ఆన్లైన్ ద్వారా అమ్మకాలు జరిపే విధంగా తగిన చొరవ చూపాలన్నారు. కూచిపూడి గ్రామాన్ని ఒక ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను వచ్చే సమావేశానికి సిద్ధం చేయాలన్నారు. కూచిపూడి గ్రామాన్ని ఆకర్షణీయమైన రంగులతో విగ్రహాలతో సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్రీయ గ్రామీణ స్వచ్ఛ అభయాన్ కింద గ్రామంలో ఒక సాంస్కృతిక నడక నిర్వహించాలని, శ్రీ సిద్దేంద్ర యోగి కళాక్షేత్రంలో ఒక అనుభవ పూర్వక కేంద్రాన్ని, మ్యూజియం, ప్రకృతి క్షేత్రాలను, కోనేరు, కనీస వసతులు అయిన మరుగుదొడ్లు తదితర ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు. అంతేకాకుండా ఒక గురుకుల అకాడమీని, కూచిపూడి మహోత్సవాన్ని నిర్వహించడంతోపాటు స్థానికులను ఒప్పించి విడిది గృహాలను కూడా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సుప్రసిద్ధ కూచిపూడి నాట్యాచార్యులు వెంపటి చినసత్యం అన్న కుమారుడు వెంపటి గోపాలకృష్ణ మాట్లాడుతూ కూచిపూడి గ్రామంలో ఒక డంపింగ్ యార్డ్ గాని, స్మశాన వాటిక గాని లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే జిల్లా కలెక్టర్ స్పందిస్తూ అవసరమైన స్థలాన్ని కేటాయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మొవ్వ తహసీల్దారుకు సూచించారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఎ పి డి హరిహరనాథ్, ఉయ్యూరు ఆర్డీఓ బి.ఎస్ హేలా షారోన్, జిల్లా టూరిజం అధికారి రామ్ లక్ష్మణ్, మొవ్వ ఎంపీడీవో సుహాసిని, తహసీల్దారు మస్తాన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# విజయవాడలో 'కన్నప్ప' ప్రత్యేక ప్రదర్శన

**అఘోరాలు, సాధువులు, నాగ సాధువులతో పాటుగా వీక్షించిన డా. ఎం. మోహన్ బాబు**





**విజయవాడ మేజర్ న్యూస్ :** విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'కి మంచి రెస్పాన్స్ వస్తోన్న సంగతి తెలిసిందే. జూన్ 27న విడుదలైన ఈ చిత్రానికి ఆడియెన్స్ నుంచి మంచి ఆదరణ దక్కింది. డివోషనల్ బ్లాక్ బస్టర్‌గా ఈ చిత్రం ఇప్పటికీ సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ క్రమంలో మంగళవారం విజయవాడలో ప్రఖ్యాత గజల్ గాయకుడు, సేవ్ టెంపుల్స్ భారత్ సంస్థ అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ కన్నప్ప చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ స్పెషల్ షోని డా.ఎం.మోహన్ బాబుతో పాటుగా నాగ సాధువులు, అఘోరాలు వీక్షించారు. అనంతరం..డా. ఎం. మోహన్ బాబు మాట్లాడుతూ.. "కన్నప్ప' సినిమాను గొప్పగా ఆదరిస్తున్నారు. ప్రతీ చోటా కన్నప్పకి మంచి స్పందన వస్తోంది. విష్ణు నటనను అందరూ కొనియాడుతున్నారు. ఇక ఈ రోజు ఇలా విజయవాడలో సోదరుడు గజల్ శ్రీనివాస్ నేతృత్వంలో షోను నిర్వహించారు. నాగ సాధువులు, సాధువులు, యోగినిలు, అఘోరాలతో కలిసి మరోసారి సినిమాను వీక్షించడం ఆనందంగా ఉంది' అని అన్నారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "కన్నప్ప'ను వెండితెరపైకి మళ్లీ తీసుకు రావడం ఓ గొప్ప నిర్ణయం. చిత్రం అద్భుతంగా ఉంది. విష్ణు నటన కన్నుల విందుగా అనిపించింది. కన్నప్ప జీవితాన్ని మరోసారి ఇంత అద్భుతంగా తీసిన నిర్మాత మోహన్ బాబుకి ధన్యవాదాలు. సినిమా ఆద్యంతం రోమాంచితంగా ఉంది. సంపూర్ణమైన భక్తి రస చిత్రంగా తీసిన చిత్రం అందరినీ ఆకట్టుకుంటోంది. అక్షయ్ కుమార్, ప్రభాస్, మోహన్ బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, విష్ణు నటన అందరినీ కదిలించింది. ఈ రోజు నాగ సాధువులు, సాధువులు, మాతాజీలు, యోగినీలు ఎంతో మంది సినిమాను చూసి ఆనందిస్తున్నారు' అని అన్నారు.



## కన్నుల పండుగగా అమ్మ భగవాన్ వారి కళ్యాణం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అమ్మ భగవాన్ వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కాలనీలో ఉద్దండి శ్రీనివాస రావు ఇంటి వద్ద శైలజ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో అమ్మ భగవాన్ కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. ఈసందర్భంగా విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకుని 200 మంది భక్తులకు అన్న ప్రసాదాలను అందజేశారు.

# అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలు ఆచరణీయం

**ఎంపీ కేశినేని శివనాథ్**

**పోలిశెట్టి పాడులో విగ్రహాల ఆవిష్కరణ**

**డాక్టర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఆవిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యే**



**విజయవాడ మేజర్ న్యూస్ :** దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా డాక్టర్ అంబేద్కర్ బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను ఆచరిస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. తిరువూరు నియోజకవర్గం ఎ. కొండూరు మండలం పోలిశెట్టి పాడు గ్రామంలోని హరిజనవాడ సెంటర్ లో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తో కలిసి ఆవిష్కరించారు. అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహానుభావుల విగ్రహాలు ఆవిష్కరించటం చాలా సంతోషం గా ఉందన్నారు. సమాజానికి తిరిగి ఇవ్వాలన్న అంబేద్కర్ నినాదం స్ఫూర్తిగా ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 విధానం రూపొందించారన్నారు. పీ 4 విధానం ద్వారా పేద ప్రజల అభ్యున్నతికి సీయం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. తిరువూరు నియోజ కవర్గానికి త్వరలో పీ 4 సభను నిర్వహించెందుకు సీయం చంద్రబాబు వస్తారని ఎంపీ కేశినేని శివనాథ్ ప్రకటించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న గ్రామ సర్పంచ్ బొల్లెపోగు చిట్టిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికెట్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్, స్టేట్ మాదిగ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య, ఎమ్. ఆర్. పి. ఎస్ నాయకులు దుబ్బాక వెంకటేశ్వర్లు, గంపల గూడెం మండల పార్టీ అధ్యక్షుడు మానికొండ రామకృష్ణ, మాజీ ఏఎంసీ డైరెక్టర్ రాంప్రసాద్ రెడ్డి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## 15వ డివిజన్‌లో ఘనంగా వైఎస్సార్ జయంతి





**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** స్వర్గీయ మహానేత డా. వైఎస్.రాజశేఖర్ రెడ్డి 76 వ జయంతి సందర్భంగా విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 15వ డివిజన్ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పెద్దలు మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్ల రావు ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ముఖ్య అతిధిగా విచ్చేసి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులు అర్పించి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో భుజంగరావు, రాజు, వెంకటరెడ్డి, సీతారామయ్య, బాలాజీ, కలాం, నాయుడు, నాగభూషణ్, చెంచయ్య, సత్యనారాయణ, సతీషు, చిన్న, బలరాం రెడ్డి, రాజు, నారాయణ రెడ్డి, పోతురాజు, డానిల్, కాము, డివిజన్ పెద్దలు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి ఆధ్వర్యంలో..



దివంగత నేత వైఎస్.రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి సందర్భంగా వైఎస్సార్ విగ్రహం దగ్గర (మలేరియా హాస్పటల్ సెంటర్)లో నగర సమగ్ర అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్, 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి కేక్ కటింగ్, పిల్లలకు పెన్ను, పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు, నగర పాలక సంస్థ వైసీపీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయ, సిద్ధార్థ, డివిజన్‌లోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, ఏ.కొండూరు, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో

ఫోన్ : 9642 980 999